రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలోని 218వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి సోమవారం ఆయన పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ చిట్టచివరి గడప వరకు చేరువై ప్రతి కుటుంబంలోనూ ఒక భాగంగా మారిందని పేర్కొన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు సేవలు సులభతరమయ్యాయని చెప్పారు. 98 శాతం మంది నియోజకవర్గ ప్రజలు ఈ వ్యవస్థ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు హయాంలో పింఛన్‌దారులను రోజుల తరబడి క్యూలైన్లలో నిలబెట్టడంతో ఒక మహిళ మృతి చెందిందని ఆయన గుర్తుచేశారు. కానీ తమ ప్రభుత్వంలో అవ్వాతాతలకు వ్యయప్రయాసాలు తప్పాయన్నారు. అలాగే 218వ వార్డు సచివాలయ పరిధిలో డీబీటీ ద్వారా 6 కోట్ల 17 లక్షల 11 వేల 606 రూపాయల లబ్ధి చేకూర్చగా, నాన్ డీబీటీ ద్వారా 4 కోట్ల 44 లక్షల 7 వేల 228 రూపాయల మేలు చేకూర్చడం జరిగిందని వెల్లడించారు. మొత్తంగా 10 కోట్ల 61 లక్షల 18 వేల 834 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, లంకా బాబు, కమ్మిలి రత్న, ఉప్పు రంగబాబు, ఎస్.రవిశంకర్, శనగవరపు శ్రీనివాస్, కృష్ణమోహన్, కొల్లూరు రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



33వ డివిజన్‌లో సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



58వ డివిజన్‌లో సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

58వ డివిజన్‌లో....

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 58వ డివిజన్ 260వ వార్డు సచివాలయ పరిధిలోని ఆంధ్రప్రభ కాలనీలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజాతో కలిసి సోమవారం పాల్గొన్నారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు. 260వ సచివాలయ పరిధిలో డీబీటీ ద్వారా ఇప్పటివరకు రూ. 5.40 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 3.50 కోట్లు మొత్తంగా రూ. 8.90 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ఏసీపీ మోహన్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, రఫీ, శనగశెట్టి హరిబాబు, యక్కల మారుతి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వేగంగా సాగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు ఎండ్ టూ ఎండ్ పావర్ బ్లాక్స్ అండ్ రోడ్డు వెడల్పు చేసే అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 3.65 కోట్లతో నిర్మించే రోడ్డు పనులు దుమ్ము, ధూళి తగ్గించేందుకు ప్రాధాన్యతనిస్తూ విజయవాడ నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి సైకిల్‌ట్రాక్, వాకింగ్‌ట్రాక్, గ్రీనరీ ఉండేలా రోడ్డు పనులు చేస్తున్నట్లు వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాస్ తెలిపారు. పావర్‌బ్లాక్స్‌తో దుమ్ముధూళి తగ్గించేందుకు ప్రాధాన్యం ఇస్తూ పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. నగరంలో మొదటి విడతగా ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. అలాగే ప్రకాష్‌నగర్ నుంచి సుమారు 400 మీటర్ల పొడవు గల రోడ్డు నిర్మాణం జరుగుతోందని ఆయన వెల్లడించారు. కండ్రికపై నుంచి వచ్చే ట్రాఫిక్ ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న కల్వర్ట్‌ను రెండు వైపులా పెంచడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా కల్వర్టు ఎత్తుగా ఉండటంతో వాహనాలు ఒకే దఫా ముందుకు రాకుండా నిదానంగా వచ్చేందుకు వీలుగా రోడ్డుకు పడమర వైపున మరో రోడ్డును నిర్మిస్తున్నారు. విజయవాడ నుంచి కండ్రిక వెళ్లేందుకు ప్రత్యేకంగా రోడ్డు కూడా నిర్మిస్తున్నారు. దీంతో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయి.



కండ్రిక జంక్షన్ వద్ద జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో రోడ్ల అభివృద్ధి పనులు మునుపెన్నడూ లేనివిధంగా వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. 64వ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ. 12 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి.

– యరగొర్ల తిరుపతమ్మ, కార్పొరేటర్

ఎక్కడా లేని విధంగా..

నగరంలో గతంలో ఎక్కడా లేనివిధంగా కండ్రిక జంక్షన్‌లో గ్రీనరీ, సైకిల్‌ట్రాక్, వాకింగ్‌ట్రాక్ ఉండేలా పనులు జరుగుతున్నాయి. ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటాయని ఆకాంక్షిస్తున్నాము.

– వి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు

క్లుప్తంగా

పోలీస్ స్పందనలో 80 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందనలో 80 మంది నుంచి డీసీపీ విశాల్ గున్ని ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 18, కుటుంబ కలహాలపై 12, ఆస్తి వివాదాలపై 12 ఫిర్యాదులు, మోసాలపై 13, ఇతర సమస్యలపై 25 మంది ఫిర్యాదులందజేశారు. బాధితులతో మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులకు డీసీపీ ఆదేశాలిచ్చారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

పటమట(విజయవాడతూర్పు): తుఫాన్ కారణంగా విస్తారంగా కురిసిన వర్షాలతో భవానీపురంలోని హెడ్‌వాటర్ వర్క్స్‌లో నీటిలో టర్బిడిటీ అధికంగా పెరిగిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టర్బిడిటీ అధికంగా పెరగటంతో హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి నగరానికి తాగునీటి సరఫరా చేయటానికి ప్లాంట్ నుంచి డిశ్చార్జ్ కెపాసిటీ తగ్గిందని దీని ప్రభావం నగరవాసులపై పడకుండా కాచి చల్లార్చి తాగాలని, తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన అన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్ తెలిపారు. ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్య ఉన్న స్థలాల్లో చేరిన వర్షపునీటిలో లార్వా నియంత్రణకు గంబూషియా చేపలు, ఆయిల్ బాల్స్‌ను వదిలే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నియంత్రణకు మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు దోమల మందు పిచికారి చేయించడం, నివాసాల వద్ద దోమల పొగ వదలడం వంటి చర్యలను నిరంతరాయంగా చేపడుతున్నామని వివరించారు. మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి లీకేజీల పరిశీలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మీసాల రాజారావు వంతెన సమీపంలోని తాగునీటి లీకేజీలను కార్పొరేటర్ శర్వాణీమూర్తి, నగరపాలకసంస్థ, వాటర్ డ్రైనేజీ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ లీకేజీల వల్ల ఈ ప్రాంతం బురదగా మారడంతో పాటు రోడ్లు పాడయ్యే ప్రమాదముందని అన్నారు. నగరపాలకసంస్థ యూజీడీ ఇన్‌స్పెక్టర్ కనపర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇక్కడ లీకేజీలు రైల్వేకాలనీకు వెళుతున్న రైల్వేవారి పైపులైన్‌ల నుంచి వస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. రైల్వే అధికారులతో మాట్లాడి లీకేజీలను సరిచేయిస్తానని శర్వాణీమూర్తి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, యూజీడీ సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి రైల్వే క్రికెట్ టోర్నమెంట్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈ నెల 15 నుంచి డిసెంబర్ 22 వరకు విజయవాడ డివిజన్‌లో 7వ డీఆర్ఎమ్ కప్ ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు రైల్వే పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పలు విభాగాల నుంచి 12 టీమ్‌లు పోటీ పడనున్నాయని పేర్కొన్నారు. అందులో మెకానికల్ అండ్ సీఅండ్‌డబ్ల్యూ, ఆర్‌పీఎఫ్, కమర్షియల్, ఎలక్ట్రికల్ లోకోషెడ్డు (ఈఎల్ఎస్), డీజిల్ లోకో షెడ్డు (డీఎల్ఎస్), ఆపరేటింగ్, అకౌంట్స్, పర్సనల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్/మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్ (టీఆర్ఓ), సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్స్ విభాగాలు ఉన్నాయన్నారు. విజయవాడ రైల్వే స్టేడియంలో జరిగే మ్యాచ్‌లలో ప్రాథమిక దశలో నాకౌట్ పద్ధతిలో 20 ఓవర్ల మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు 25 ఓవర్ల పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. ఈ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి 2024 మార్చిలో జరిగే దక్షిణ మధ్య రైల్వే ఇంటర్ డివిజనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు.

దుర్గా మల్లేశ్వర స్వామి సన్నిధిలో అన్న ప్రసాద వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సోమవారం సాయంత్రం సంధ్యాసమయంలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పంచహారతులసేవ నిర్వహించారు. ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఈఈ ఎల్.రమాదేవి, ఏఈవో ఎన్.రమేష్‌బాబులు ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఏఈవో చంద్రశేఖర్, సూపరింటెంటెంట్లు పర్యవేక్షించగా, ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



రాజగోపురం ఎదుట అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

స్పందన సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

మేయర్, కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం సిద్ధంగా ఉండాలని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 15 సమస్యలు వీరి దృష్టికి రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగంపై-10, ఇంజినీరింగ్ విభాగంపై-2, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)పై-2, ఉద్యానవన విభాగంపై-1కు సంబంధించి అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, అడిషనల్ కమిషనర్(జనరల్) కే శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ రావు, సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, పీవో (యుసిడి) రోహిణి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఆర్.యఫ్.ఓ. వెంకటేశ్వరావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, వీఏఎస్ డాక్టర్ రవి చంద్ పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్వరరాగ సమ్మేళనం.. కృష్ణవేణీ సంగీతోత్సవం

విజయవాడ కల్చరల్: కేంద్ర సంగీత నాటక అకాడమీ, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కేంద్ర టూరిజం శాఖ, ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాలు జాతీయ సమైక్యతను చాటుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమాలు కర్నాటక సంగీత విద్వాంసులు విష్ణుభొట్ల సరస్వతి, విష్ణుభొట్ల కృష్ణవేణి కచేరీతో ప్రారంభమయ్యాయి. త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్ కీర్తనలను మధురంగా ఆలపించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ్ జొన్నలగడ్డ బృందం పదకవిత పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుని కీర్తన అదిగో కొలువై వున్నాడే, నారాయణ తీర్థుల తరంగాలు జయదుర్గే కీర్తనతోపాటు జగన్మోహన రాధారమణ భక్తి గీతాలను గానం చేశారు. బెంగళూరుకు చెందిన మైసూరు నాగమణి మైసూరు వాసుదేవా చారి కీర్తనల భక్తిగా ఆలపించారు. ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ బృందం అంధ్రదాస సంప్రదాయ కీర్తనలను, తమిళనాడుకు చెందిన భరత్ సుందర్, తమిళనాడుకు చెందిన ఎస్.సౌమ్య, మల్లాది సోదరులు శ్రీరాం ప్రసాద్, రవికుమార్ సంప్రదాయ కీర్తనల ద్వారా ఆట్టుకున్నారు. వాడపల్లి కృష్ణకుమారి, బొడ్డపాటి చంద్రశేఖర్ నిర్వహించిన వ్యాఖ్యానం అలరించింది. ఏపీ సృజనాత్మక సమితి సీఈవో ఆర్ ఆర్ మల్లికార్జునరావు నిర్వహించారు.



శ్రీరాం జొన్నలగడ్డ బృందం భక్తి సంకీర్తనల గానం

కనక దుర్గమ్మకు స్వరనీరాజనం....

కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో భాగంగా కనక దుర్గమ్మ దేవస్థానంలోని ధర్మపథం ప్రాంగణంలో సోమవారం తమిళనాడుకు చెందిన విదుషీమణి వి.సుమత్ర ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలు మధురంగా ఆలపించారు. సంగీత విద్వాంసులు దేవీ కృతులను గానం చేశారు. వయోలిన్‌పై నందకుమార్, మృదంగంపై కల్యాణరామన్ వాద్య సహకారం అందించారు. దేవాలయ ఏఈవో ఎన్.రమేష్, ఈఈ రమాదేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి శేష వస్త్రాను తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి సూచించారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో సోమవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అప్పుల భయంతో వృద్ధుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భవానీపురం వెలంపల్లి కాలనీకి చెందిన అబ్దుల్‌వహీద్ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. వహీద్ ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు చేశాడు. అప్పుల వాళ్లు ఇంటికి వస్తుండడంతో ఆందోళన చెంది ఈ నెల ఎనిమిదో తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా అతని ఫోన్ స్విచాఫ్ వచ్చింది. బంధువులు, స్నేహితులను విచారించినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో వహీద్ కుమారుడు అబ్బాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంకి చెందిన వివాహిత అదృశ్యమైనట్లున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, పాయకాపురంకి చెందిన బడే సతీష్ అనే వ్యక్తితో ఆదిలక్ష్మి(29)కి వివాహం జరిగింది. ఆమె క్యాటరింగ్ పనులకు వెళ్తుంటుంది. గత నెల 28న క్యాటరింగ్ పని డబ్బులు తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. అదే రోజు రాత్రి 9గంటలకు భర్త సతీష్ ఫోన్ చేయగా కృష్ణలంకలో క్యాటరింగ్ పనికి వచ్చానని చెప్పింది. మళ్ళీ రాత్రి 10.45కి ఫోన్ చేయగా స్విచ్ఆఫ్ చేసినట్టు వచ్చిందని, అప్పటి నుంచి ఇంటికి రాలేదని భర్త సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కార్తిక సోమవారం కావడంతో గుడికి వెళ్లి వస్తానని చెప్పిన తొమ్మిదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గద్దెవారి పొలాలు ప్రాంతానికి చెందిన మైనర్ బాలిక నగరంలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కార్తిక సోమవారం గుడికి వెళ్లి వస్తానని ఉదయం ఇంటి నుంచి వెళ్లిన బాలిక సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బాలిక కోసం స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

పాయకాపురం(విజయవాడరూరల్): అకాల వర్షాలతో కండ్రిక పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి బాధిత రైతులను ఓదార్చారు. గుణదల, కండ్రికప్రాంత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించారు. కండ్రికలో దాదాపు 30 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి, పంట నష్టంపై సమగ్ర వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. అలాగే అకాల వర్షాలతో పశువులు వ్యాధుల బారిన పడుతున్నట్లు పాడి రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడం జరిగింది. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ శ్యామ్, నాయకులు యరగొర్ల శ్రీరాములు, ఎస్‌కె.ఇస్మాయిల్, వెంకటేశ్వరమ్మ, అక్కిశెట్టి నారాయణ, రైతులు దేవిరెడ్డి మంగారెడ్డి, బీమిరెడ్డి సాంబిరెడ్డి, చిన్ని శ్రీనివాసరావు, సాదం శ్రీనివాసరావు, దోనబోయిన సుబ్బారావు, శరణాల గోపిరాజు, అవుతు జానారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పడిపోయిన వరిపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

ముత్యాలంపాడులో....

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామి వారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు సోమవారం జరిగాయి. విశేషసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి దాట్ల శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు, చిరంజీవి పర్యవేక్షించారు.



ముత్యాలంపాడులో రామలింగేశ్వరస్వామి



సామూహిక సత్యనారాయణ వ్రతాలు

శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో....

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో మాసశివరాత్రి పురస్కరించుకుని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన అన్నాభిషేకం, రుద్రాభిషేకం సోమవారం జరిగింది. శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామివారి కళ్యాణం సాయంత్రం నిర్వహించారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు ...

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా సామూహిక శ్రీరమాసత్యనారాయణ వ్రతాలు సోమవారం జరిగాయి. 60 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సినీఫక్కీలో చోరీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం రామకృష్ణాపురానికి చెందిన వెంపటి వల్లీకుమారి ఈ నెల 9వ తేదీన బంధువుల ఇంట్లో వేడుక ఉండడంతో వెళ్లింది. అయితే ఆదివారం ఆమె రేకులషెడ్ ఇంటి పైకప్పు తొలగించి ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి ఆమెకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో దాచుకున్న రూ.84 వేలు విలువైన బంగారు ఆభరణాలు, రూ.4 వేల నగదు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాదర్‌ను సమర్పించిన ఎమ్మెల్సీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రఖ్యాతిగాంచిన రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గాకు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా సోమవారం చాదర్‌ను సమర్పించారు. వాంబేకాలనీలోని ఆస్థాన ఏ గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఖాజాబాబా ఆశ్రమం ప్రతినిధులు అజ్మీర్ షరీఫ్ దర్గాకు వెళ్తుండటంతో వారికి ఎమ్మెల్సీ రుహుల్లా చాదర్ అందజేశారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ పరమ పవిత్ర అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఆశ్రమ నిర్వాహకులను కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, ముస్లిం పెద్దలు బాషా, రషీద్, అమిత్, మస్తాన్, గౌస్, ఖాజాబాబా ఆశ్రమం కమిటీ వ్యవస్థాపకుడు పఠాన్ బాబ్జి ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్తిక దీపోత్సవం..

కార్తికమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో భక్తులు కృష్ణానదిలోని దుర్గాఘాట్‌లో స్నానమాచరించి కార్తికదీపాలు వెలిగించారు. అనంతరం శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. చల్లపల్లి బంగ్లా వద్ద ఉన్న శివాలయంతో పాటు వన్‌టౌన్, మొగల్రాజపురంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





